# జీవితాంతం తోడుంటాననే అతని మాటల్లో నిజం లేదని ఆమెకెలా తెలుసు?

# కన్నీరు జారితే

కొరుకొండ సత్యానంద్ కథ

''వచ్చినపని మరచిపోయి మీరేవేవో మాట్లాడుతూ టైమ్ వేస్ట్ చేస్తున్నారు''

''లేదు. నీ మాటలు వింటుంటే టైమ్ తెలియడంలేదు''

''మీ మాటలు నాకు అర్థంకావడంలేదు''

''నిన్ను అర్థం చేసుకోవడానికే ప్రయత్నిస్తున్నాను''

''అంత అర్థం కానివి ఏం కనిపిస్తున్నాయి నాలో?''

''మనసు... నీ మాటలు''

''మనసు. అది నాకు లేదు. నాకేకాదు. నాలాంటి వాళ్లెవరికీ అసలది వుండదు''

''మనసనేది లేకపోతే నీ మాటలు ఇంత ఆకర్షణీయంగా, అర్థవంతంగా వుండవు''

''అర్థం పరమార్థం లేని జీవితం నాది. మాటల్లో దింపారు మీరు. నేనేదో మాట్లాడేస్తున్నాను. ఆ మాటల్ని ఏవో గొప్పవిగా భావిస్తున్నారు మీరు''

''లేదు సుమతీ. గొప్పదనాన్ని అందరూ అర్థం చేసుకోలేరు''

''నీచమైన నా జీవితంలో గొప్పదనం ఏముంది?''

''ఉంది. అది నాకు అర్థం అవుతుంది. నిన్ను చూస్తుంటే, నీ మాటలు వింటుంటే నాకేదో చేయాలని అన్పిస్తుంది''

''ఏం చేయాలనిపిస్తుంది?''

''నిన్ను చేజారిపోనివ్వగూడదనిపిస్తుంది''

''నా జీవితం ఎప్పుడో చేజారిపోయింది''

''... అని అనుకుంటున్న నీ జీవితాన్ని నిలబెట్టాలనిపిస్తుంది నాకు''

''అంటే...?''




''నాతో వచ్చేస్తావా?''

''ఎక్కడికి?''

''ఈ నరకంలోంచి మా బాహ్య ప్రపంచంలోకి''

''మీ ప్రపంచం నాకొక నరకమైంది. అందులోంచే నేనిక్కడకు వచ్చాను''

''ఎక్కడో పొరపాటు జరిగింది.''

''అవును. పొరబడి ప్రేమించాను. ప్రేమించి

మోసపోయాను''

''ఎవర్ని ప్రేమించావు?''

''మాటల్తో మత్తుజల్లి, మనసును స్వాధీనపరుచుకుని నా జీవితాన్ని తన చేతుల్లోకి తీసుకుని ఆ తర్వాత ఎందరి చేతుల్లోకో విసిరేసి నన్నీ స్థితికి తీసుకువచ్చిన ఓ నయవంచకుడిని!''

''జరిగింది మరచిపో''

''గుర్తున్నా, మరచిపోయినా మరలిరానిది ఆ కాలం. అప్పుడు కాలం గుర్తుండేదికాదు. అందుకే అది నాపై కసి పెంచుకుని ఈ హాలాహలాన్ని చవిచూపిస్తుంది''

''అందుకే నా మాట విను''

''ఎక్కడికి తీసుకెళ్తారు?''

''జీవితంలోకి...''

''అదే, ఎలాంటి జీవితంలోకి?''

''నువ్వు చేజారిపోయిందన్న జీవితంలోకి''

''సూటిగా చెప్పండి. మీరేం చేస్తారు?''

''బయటకు తీసుకెళ్లి నా నీడలో చోటునిస్తాను''

''అంటే... ప్రత్యేకంగా నన్ను ఉంచుకుంటారా?''

''కాదు...''

''పోనీ పెళ్లిచేసుకుంటారా?''

''చేసుకునేవాడ్నే, నేను అవివాహితుడ్ని కాకపోతే!''

''అయితే ఏం చేస్తారు?''

''చక్కగా బ్రతకగలిగే దారి చూపించి ఆ దారిలో నువ్వు సక్రమంగా నడవగలిగేవరకూ తోడుంటాను''

''నిజంగా అలాగే జరిగితే నా అంతటి అదృష్టవంతురాలు ఎక్కడా వుండదు. చాలా టైమైంది. రండి''

● ● ●

''టైమెక్కువే పట్టినా చెమట ఎక్కువగా పట్టలేదు.''

''నాది ఎక్సర్‌సైజు బాడీ. రోజుకి రెండు గంటలు జిమ్‌లో గడుపుతాను''

''మీకెలా వుంది?''

''చాలా హాపీగా వుంది. సంతృప్తిగా వుంది. మరి నీకు?''

''నాకూ హాపీగానే వుంది''

''మరి నే వస్తానూ...''

''... ఎప్పుడు?''

''నా ప్రయత్నాలు సఫలమైన వెంటనే. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని చెప్పడానికి త్వరలోనే వస్తాను''

''ఎన్నాళ్లు పడుతుందో చెప్పగలరా?''

''నెలపైన. రెండు నెలలలోగా''

''మీకోసం ఎదురుచూస్తుంటాను''

''మంచిది. నేనొచ్చేలోగా ఏ నిర్ణయమూ తీసుకోవద్దు. ఎవరికీ అనుమానం రాకుండా వుండాలంటే, నేనొచ్చేవరకూ ఇలాగే కొనసాగాలి''

''అలాగే. అయితే చిన్నమాట''

''ఏమిటి?''

''మీరు అబద్ధాలు బాగా చెప్తారు''

''... ... ...''

''నమ్మేలాగా చెప్తారు''

''సుమతీ. ఏమిటి నువ్వంటున్నది?''

''అవును. మీ గుండెమీద చేయి వేసుకుని చెప్పండి. మీ మాటలన్నీ అబద్ధాలుకావూ? మళ్లీ మీరు వస్తారా? రారు''

''ఎందుకిలా మాట్లాడుతున్నావు? ఎందుకు రాను?''

''మరచిపోయి వస్తారేమోగానీ కావాలని మాత్రం రారు. మళ్లీ ఏవో చెప్పి మంచి అనుభవం అందుకోవడానికి వస్తారేమోగానీ, ప్రయత్నం సఫలం అయిందని చెప్పి నన్ను తీసుకెళ్లడానికి రారు కదూ?''

''నువ్వు పొరబడుతున్నావు''

''అనుభవం ఉన్న నేను పొరబడే అవకాశాలు చాలా తక్కువ. శరీరాన్ని కాసేపు కొనుక్కోవడానికి కొందరొస్తే - అప్పుడప్పుడూ శరీరానికి డబ్బునిస్తూ మనసుకి ఆశ మత్తునిచ్చేవాళ్లు కొందరొస్తారు''

''అంత అవసరం నాకేముంది?'' -

''ఉంది. తక్కువ డబ్బుతో ఎక్కువ సుఖాన్ని పొందొచ్చు. మనసుని కదిలించగలిగితే అణువణువునూ సొంతం చేసుకోవచ్చు. చాలా సంతృప్తిని పొందొచ్చు. సహకారం లేనిదే ఎంత అమ్ముడుపోయిందానిదగ్గరైనా ఏం సుఖం దొరుకుతుంది? అదీకాక మీ మగవాళ్ల మగతనం ఒదిగిపోయే ఆడదాని దగ్గరేకానీ - ఎదురుతిరిగే దానిదగ్గరో, ఎగతాళి చేసేదానిదగ్గరో ఏమాత్రం కన్పించదు. అందుకే మీలాంటి కొంతమంది ఇలాంటి మాటలు చెప్తారు. అవునో కాదో నా కళ్లలోకి సూటిగా చూసి చెప్పండి...

... మీది నిజం కాదని మీకు తెలుసు. మీది నటనేనని నాకు తెలసని మీకు తెలీదు. జీవితాన్ని కోల్పోయినా, జీవితాన్ని చదివినదాన్ని. మీలాంటి వాళ్లెందరిదగ్గరో వున్నదాన్ని. మీ మాటల్లాంటి మాటలెన్నింటినో ఎన్నోసార్లు విన్నదాన్ని. ఎదురుచూసి క్రొత్తలో కొన్నిసార్లు నిరాశపడినదాన్ని...

మీకు తెలియని విషయం ఒకటుంది. మీకు ఉత్సాహాన్నీ, సంతృప్తినీ ఇచ్చిన నా నిట్టూర్పులు నిజంకావు. నా పంటిగాట్లు ప్రేమ నిండినవి కావు. నేను ప్రదర్శించిన బాధ, మూల్గులు నిజంకావు. అందరిలాగే, అందరికీలాగే మీకిచ్చింది శవంలాంటి శరీరాన్నే. మీ మాటల్ని నమ్మినట్టు, మీ మంచితనానికి ముగ్ధురాలైనట్టు, సర్వాన్నీ అర్పిస్తున్నట్టు, మీ మగతనానికి జోహార్లర్పిస్తున్నట్టు... అన్నీ నటనే. అంతా నటనే!

... చివరగా చిన్నమాట. క్రొత్తగా ఈ మలుపులోకి తిరిగినవాళ్లు ఎదురైతే మీకు చేతనైంది చేయండి. ఏమీ చేయలేకపోయినా ఫర్వాలేదు. చేయకపోయినా తప్పులేదు. కానీ ఇలా ప్రలోభ పెట్టకండి. జీవితం చేజార్చుకున్నవాళ్లు అది మళ్లీ అందుతుందంటే ఆశతో ఎదురు చూస్తారు. క్రొత్తవాళ్లైతే మరీను. వాళ్ల కళ్లల్లోంచి నిరాశ కన్నీళ్లయితే... అవి జారితే మీ జీవితం మరోలా చేజారిపోవచ్చు. జాగ్రత్త.

... ఇంక మీరు వెళ్లొచ్చు.

